# "అంతర్నాటకం"

కాశీనాథుని సువర్చలాదేవి

పూర్తిగా నవలలో మునిగిపోయిన నాకు చిన్నన్నయ్య పిలుపు వినపడనేలేదు. అన్నయ్య నన్ను కుదుపుతూ "విశాలా! ఇంకా ఈ అవతారంతోనే ఉన్నావా! చూడు. టైమెంతయిందో!" అని విసుక్కున్నాడు. అన్నయ్య చిరాకు చూసిన నాకు నవ్వొచ్చింది. 'ఏమిటన్నయ్యా!' అన్నాను చేతిలో నవల క్రింద పెడుతూ. "ఏమిటంటున్నావా! నిరంజన్ పాట కచేరీ అని చెప్పలా నీకు – త్వరగా తయారుకా—లే!" అంటూ తను తయారు కావడం మొదలుపెట్టాడు. నాకు ఏ మాత్రం కదలాలని లేదు-అన్నయ్య రానంటే వినడు. చీరవంక చూసుకున్నాను, బాగానే వుందని పించింది. బద్ధకంగా లేస్తూ 'నేను రెడీ అన్నయ్యా!' అన్నాను చెప్పులేసుకుంటూ. అన్నయ్య ముఖం క్వశ్చన్ మార్కులాగ తయారయింది. నా వంక కోపంగా చూసి 'అమ్మా!' అంటూ వంట ఇంటివైపు వెళ్ళాడు. చివరకు నేను లేత గులాబిరంగు జరీచీర - తలలో ఒకే ఒక గులాబీ పువ్వు-కాళ్ళకి ఎర్రని మఖ్‌మల్ చెప్పులతో అలంకరణ పూర్తి చేసుకొని బయట వచ్చాను. అన్నయ్య నా వంక తృప్తిగా చూస్తు నా తలలో గులాబీ పువ్వు చెవికిందగా జార్చి 'ఊ—పద.' అని బయలుదేరాడు.

అప్పుడే సంధ్య ప్రవేశించింది. ఆకాశమంతా ఎర్రగులాబీ రేకులు పరచినట్లున్నది. రోడ్డువారగా నడుస్తున్న నాకు 'సరస్వతీ కళామందిరం' చేరినట్లుగా తెలియనే లేదు.

"విశాలా! పద-త్వరగా నిరంజన్‌ని పరిచయం చేస్తాను!" అంటూ స్టేజివైపు దారితీస్తున్న అన్నయ్యను మౌనంగా అనుసరించాను.

తెల్లగా బలంగా ఉన్న ఒకతను వడివడిగా మా వైపు రావడం నేను గమనించాను అతను వస్తూనే అన్నయ్య చెయ్యి పట్టుకుని నా వైపు నిశితంగా చూస్తూ "వేణూ! ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి." అన్నాడు. అప్పటికే అందరూ మావైపు చూస్తున్నారు. గుస గుసలు చెప్పుకుంటున్నారు. హాలంతా జనంతో కిట కిటలాడి పోతున్నది. నాకు సిగ్గుతో బుగ్గలు వెచ్చబడ్డయి. ఏమిటిది? అన్నయ్య కసలేమీ తెలియదు అనుకుంటుండగానే "విశాలా! ఇతనే 'నిరంజన్!' అని నాకు పరిచయం చేశాడు. నేను ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసి మరీ చూసాను.

'విశాలా...చాలా బాగుంది పేరు – సరయిన పేరు కూడా!" అన్నాడతను నవ్వుతూ. తెల్లగా దానిమ్మ గింజలు వలిచి పోసినట్లు తళుక్కుమని నవ్వాడతను. నా గుండెలలో ఏదో అనుకంపన! మనసులో ఏదో మధురోహ! ఇతని ఫోటో చాలా సార్లు పేపర్లలో చూసాను. అతన్ని చూడగానే ఏదో సాన్నిహిత్యాన్ని ఫీలయినట్లని పించింది. "వేణూ! ఇక్కడే కూర్చోండి! మీ కోసమే రిజర్వు చేయించిపెట్టాను!" అని మమ్మల్ని కూర్చోబెట్టి మరొకసారి నన్ను క్షణకాలం నిశ్చలంగా చూసి అంతర్ధాన మయ్యాడు.

అప్పటిదాకా ఊపిరి పీల్చుకోవడం మర్చిపోయిన నేను హాయిగా గుండెలనిండా గాలి పీల్చుకొని అన్నయ్య పక్కన కూర్చున్నాను.

"అన్నయ్యా! మనం వస్తున్నట్టుగా ఆయనకి తెలుసా!" అన్నాను ఆశ్చర్యంగా, అన్నయ్య తల ఊపాడు.

'ఇంత ప్రఖ్యాత గాయకుడు నీకు తెలుసన్న మాట. నాకు ఎప్పుడూ చెప్ప లేదేం?'

'నిన్ను సస్పెన్సులో పెడదామని!' చిలిపిగా నవ్వుతూ అన్నాడు అన్నయ్య. హాలంతా గోలగా ఉంది. ప్రోగ్రాం ఎప్పుడు మొదలు పెడతారో తెలియదు విసుగ్గా అనిపించింది. అన్నయ్య ఇప్పుడే వస్తానని స్టేజి లోపలి వైపు వెళ్ళాడు. కుర్చీలో వెనక్కివాలి స్టేజీవైపే చూస్తూ కూర్చున్నాను. 'ఇక చెప్పు! ఏమిటీ అవతారం! నిజంగా నిన్నే గుర్తుపట్టలేదు సుశీలా!' పరధ్యానంగా ఉన్న నన్ను ఈ మాటలు అయస్కాంతంలా ఆకర్షించినయి. కొద్దిగా తల తిప్పి చూసాను. బంగారు రంగులో ఆకర్షణీయంగా ఒక యువతి, చామనఛాయలో పాలి పోయిన ముఖంతో నీరసంగా మరో యువతి కూర్చుని ఉన్నారు. వాళ్ళకి లోకంతో సంబంధం ఉన్నట్టు కనపడడం లేదు వాళ్ళ ధోరణిలో వాళ్ళున్నారు. ఆ చామనఛాయగా ఉన్న యువతి వేషధారణ 50రూ॥ల టిక్కెట్టుగల కుర్చీలకి ఏ మాత్రం సరిపోలేదు సరికదా ఎబ్బెట్టుగా కూడా అనిపించింది. మరీ అంత చిరుగులు కూడా కుట్టుకోని చీరతో ఎట్లా వచ్చిందా అని ఆశ్చర్యపోతూ ఎవరికోసమో అన్నట్టు వెనక్కి తిరిగి మళ్ళీ చూసాను. నీరసంగా రక్తహీనంగా ఉన్న ఆ కళ్ళల్లో ఏదో ఆకర్షణ లేకపోలేదు.

'అరుణా! నిన్ను మళ్ళీ ఈ జన్మలో చూస్తావనుకోలేదు!' సుశీల అంటున్నది.

'అది సరేలే! నాకీ విషయం చెప్పు! అసలిదంతా ఎలా జరిగింది. ఏ కారణంగా నువ్వీ స్థితికి వచ్చావు!' అరుణకి ఆవేశం తప్ప పరిసరాలు స్ఫురణకి ఉన్నట్టు తోచలేదు.

'ఈ ప్రపంచంలో ప్రేమించటమే మహా నేరమ్మయితే – ఆ నేరానికి శిక్షే నా ఈ స్థితి!'

నాలో ఉత్సుకత పెరిగింది. నా ప్రమేయం లేకుండానే నా చెవులు ఆ ఇద్దరు యువతుల సంభాషణను రిసీవ్ చేసుకుంటున్నాయి. ఇంతలో సభంతా నిశ్శబ్దమయింది. సూదిక్రింద పడినా వినపడేటంత నిశ్చల నిశ్శబ్దం!

అలలు అలలుగా ఏదో శబ్ద తరంగాలు ప్రేక్షకులను ముంచెత్తుతున్నాయి. గానవాహినిలో తేలిపోతున్నారు ప్రేక్షకులు! చాలా సేపటి వరకూ నిరంజన్ పాడుతున్నాడనే స్ఫురించలేదు! రాళ్ళు కరగడం నిజమేనేమో! ఏమి మాధుర్యం అది! ప్రకృతిలోని సమస్త చైతన్యమూ స్తంభీభూతమై పోయినట్టనిపించింది! తేనె వాకలుగా-వెన్నెలసోనగా మలయమారుతంగా-"హిందోళం" సర్వప్రపంచాన్ని తన కైవసం చేసుకున్న దా క్షణంలో.

'ఛ! ఏడుస్తున్నావా! సుశీలా! ఏమిటది?" చిన్న బెదిరింపుకి అదిరిపడి ఈ లోకంలోకి వచ్చాను.

'హిందోళం' ఆగిపోయింది. నిరంజన్ ఇంకో పాట అందుకున్నాడు.

నా మనసు నిరంజన్ పాటకంటే దీనమైన ఆ యువతి కథవైపే మొగ్గింది. వీళ్ళు మాట్లాడుకోదలుచుకొంటే ఇక్కడికి రావటమేందుకో నాకు అంతుపట్టలేదు. నూరు రూపాయలు ఖర్చుపెట్టి ఈ సభకు వచ్చి ఇక్కడ స్వవిషయాలు మాట్లాడుకోవలసిన అవసరం ఏమొచ్చిందో ఎంతకూ అర్థం కాక అయోమయావస్థలో వద్దనుకుంటానే వినసాగాను. "సుశీ! ప్రేమిస్తే ప్రేమించావు! కాని, నువ్వు అతన్నలా వదలకుండా ఉండవలసింది! కోర్టులో దావావేసి ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తే చచ్చినట్టు దారికొచ్చేవాడు." ఈ అరుణకి ఎంతైనా ఆవేశం ఎక్కువనిపించింది!

"పిచ్చిదానా! అట్లా దారిలోకి తేగలమా! అయినా నాకు సాక్ష్యమేది?"

"అంటే మీ పెళ్ళికి సాక్ష్యమే లేదా!" అంత వరకు ఎలాగో నెమ్మదిగా మాట్లాడుతున్న అరుణ బిగ్గరగానే అంది.

వెనకనుంచి ఎవరో మాట్లాడవద్దని అభ్యర్థిస్తున్నారు. అయినా వీళ్ల లెక్క చెయ్యటం లేదు. తగ్గు స్వరంలో మాట్లాడుకుంటూనే వున్నారు. "సాక్ష్యం వుంది అరుణా! అనంతమైన ఈ ప్రకృతి మా ప్రథమానుభూతికి కారణమైన చక్కని చిక్కని నిశీధి! ఆత్మలు, అంతరాత్మలూ అంటూ వుంటే, అవి-ఇంకా చెప్పాలంటే హృద్గతమైన నా ప్రణయం ఈ సాక్ష్యాలు చాలవా!"

అరుణ తాలూకు వేడి నిట్టూర్పుకి నా మెడ కమిలిపోయింది.

కొంతసేపు నిశ్శబ్దంగా వినసాగారు. వెనక నుంచి ఏ మాటలూ లేవు. నా మనసంతా ఏదో భారంగా అయిపోయింది.

ఇంద్రియములైన విషయాలు అభివ్యక్తం అయినంత సులభంగా హృద్గతములైన విషయాలు అభివ్యక్తం కావు. ప్రణయం హృద్గతమైన విషయం! అది స్వయం ప్రకాశమైన అనుభవం! దీన్ని గుర్తించడానికి కొంత సంస్కారమే కాదు వ్యవధానం కూడా కావాలి. బహుశా ఈ లోపం చేతనేమో ఈ నాటి చాలా ప్రేమ వివాహాలు విఫలమవుతున్నాయి!

"పోనీ రహస్యంగానైనా వివాహం జరిగిందా!" అర్థం లేకుండా అడిగింది అరుణ.

"మనసుతోటి బంధం వెయ్యాలి కాని కాళ్ళతోటా అన్నారు - నిజమేననుకున్నాను. ఇంతకీ నాది దౌర్భాగ్యం!"

"నీది కాదు సుశీలా తప్పు! ఈ దేశం! ఈ దేశంలో పుట్టిన ఆడదాని దౌర్భాగ్యం. ప్రేమించటమనే మహాభివాన్ని ఈ పురుష జాతి భరించలేదు! ప్రేమించడం మహా పాపం! అందులోనూ ప్రతి వాడ్నీ అనలే ప్రేమించ కూడదు. వాడి ఆస్తి, అంతస్తు, హోదా, ధైర్యం ఇవన్నీ చూసుకొని సరదాగా ప్రేమించానని చెప్పుకోవచ్చు! అంతేకాని నిజంగా ప్రేమించ కూడదు. ప్రేమించినట్లు నటించాలి! అంతగా ప్రేమించటం నీ హాబీ ఆ నటనలో కొంత సత్యారోపణ చేసుకో! మన జీవితాన్ని ప్రేమ అనే వలలో పడేసి అందులో మనం బందీకాకూడదు! జీవితాన్ని కలగామార్చి అందులో ప్రేమను బంధించాలి-తెలిసిందా: కానీ, ఏం చేస్తావు! చేతులు కాలిపోయినయి! ఏ మందు వాడినా మచ్చ మిగిలిపోతుంది!"

"అరుణా! నువ్వు జీవితంలో నటనను గురించి ఆలోచిస్తున్నావు. నేను జీవితాన్ని ఆలోచిస్తున్నాను, నేను ఓడిపోలేదు అరుణా! లౌకికమైన ఈ అనుభవాలు నన్ను ఏమీ చెయ్యలేవు! నేను తృప్తిగా జీవిస్తున్నాను. ప్రేమించిన వాడిని భర్తగాపొందాను. నా దృష్టిలోనే అనుకో! ఆయన సంతానానికి తల్లినయాను. నా చిన్నారి పాపను చూసుకొని నేను గర్వపడతాను. అరుణా-బాధపడను!" సుశీల గొంతు జీరపోయింది. 'ఓసి పిచ్చిదానా! ఇక్కడ కావలసింది నీ దృష్టి కాదే! లోక దృష్టి! సుశీల మాట్లాడలేదు. నా కేదో జీవన్మరణ సమస్యలాగా ఊపిరాడనట్లనిపించింది. ఆడవాళ్ళెంత అయోమయ స్థితిలో ఉన్మాద స్థితిలో జీవితాన్ని గడుపుతారో! పురుషుని కోసం స్త్రీ యెంత త్యాగం చేయటానికైనా సిద్ధపడుతుంది! జనకుని కూతురు-ఆర్యగుణశాలిని, దశరథ జననాథుడు మామ, విశాల యశశ్రీ ధనుడగు రాముడు పతియైన జానకి కోరి అతనితో 'అరణ్యయానము' నకు సిద్ధపడినది! పురుషుడు ఆత్మ

స్త్రీకి అర్పితమయిన దివ్యక్షణంలో స్త్రీ తమ సమస్త చైతన్యాన్ని పురుషుడి ధారాదత్తం చేయ్యదా?

ఆధునిక యువకులు తమ ప్రియలలో మధుర మోహన మౌగ్ధ్యము, కారుణ్య లజ్జా విలాసాదులు కనుగొన గలిగిన అదృష్టవంతులు కారు. ఈ సృష్టిలో ఏ సౌందర్యమూ, ఏ విలాసము, ఏ లావణ్యమూ 'స్త్రీ' గా మూర్తీభవించాయని మనం అనుకుంటున్నామో - ఆ మధుర భావానికి 'ఆశ్రయం' తప్పి పోతున్నది.

'చివరకు ఏమన్నాడు?' నెమ్మదిగా అంది అరుణ.

''అనటానికే ముంది? నా లాంటి అమ్మాయితో ప్రణయం బాగానే వుంటుందట. ఈ సంఘంలో తనకు పేరు ప్రతిష్ఠలు ఉన్నవట? నన్ను వివాహం చేసుకోవడం వల్ల పెద్దలకు మనస్తాపం కలుగుతుందట? ఏ సృష్టి కార్యానికో, ధర్మబద్ధమని నమ్మిన నా దాంపత్య జీవితం మొగ్గలోనే విడిపోయింది. నేను మాట్లాడలేదు? ధర్మము, మనస్తాపమూ ఇవన్నీ అర్థంలేని మాటలుగా అనిపించినయి? ఏమీ తెలియని అమాయకుడికి చెప్పవచ్చు కాని మూర్ఖుడికి ఏం చెప్పగలము: అయినా "నువ్వు నాకు తగవు? నీ కడుపున పెరుగుతున్న రక్త బంధాన్ని నువ్వే నాశనం చేసుకో.'' అన్న ఒక జడ పదార్థంతో మాట్లాడడానికి నాకు ఏ భాష వాడాలో తెలియలేదు? సృష్టిలో అనాదిగా జరుగుతూనే వున్న కొత్త కథ కాని పాత కథ? అయినా ఏ వ్యక్తి అనుభవం ఆ వ్యక్తిదేగా?'' ఆయాసంగా ఆగింది సుశీల.

నేను తప్ప నిరంజన్ గానామృతంలో మునిగిపోని ప్రాణి నా కా హాలులో కనపడలేదు? ఆ ఇద్దరు స్త్రీ మూర్తుల బాధ మూగగా మౌనంగా నేనూ అనుభవిస్తున్నానని వాళ్ళకి తెలియదు? యుగయుగాలుగా మానవత్వం తనలో మిగుల్చుకున్న అనుకంప అనాదిగా సృష్టిలో జరుగుతునే వున్న మంచి చెడుల సంమర్షణలోని గెలుపూ, కొన్ని కోట్ల సంవత్సరాలుగా అనంతంలోంచి ప్రవహిస్తూనేఉన్న తారకల వెలుగూ-వీటికి ఆ స్త్రీ మూర్తి రూపాంతరం.

'ఇంతకి భవిష్యత్తు గురించి ఏం నిర్ణయించుకున్నావు?'

"కష్టపడి పాపను పెద్ద చేస్తాను. నా రక్తం ధారపోసి దాన్ని ప్రయోజకురాల్ని చేస్తాను. దానికి వయసు వచ్చిన తరువాత దాని వివాహ సమస్య నీకు వదలి నేను తప్పుకుంటాను. అరుణా? భయపడుతున్నావా? లక్షల ఆస్తికి వారసురాలయిన నీకు ఇదేమంత పెద్ద కష్టం కాదనుకుంటా? ఒక పేద స్నేహితురాలి కి మాత్రం సహాయం చెయ్యలేవా? పాపకి ఇప్పుడిప్పుడే అన్నీ తెలుస్తున్నాయి. నాన్నని గురించి అది అడుగుతుంటే సమాధానం చెప్పలేక పోతున్నాను. నా కనుపాపల్లో చూడమని చెప్పనా? నా గుండెలు చీల్చి చూడమననా? ఏం చెయ్యను? ప్రేమించటం, నమ్మడమే నా అపరాధమయితే దానికింత పెద్ద శిక్షా? పాపకి సమాధానం చెప్పలేని నా అసమర్థతకి నేను క్రుంగిపోతున్నాను. ఈ నేరం ఎవరిది? ''నీకు నా 'హిందోళం' కావాలి - నాకు నువ్వు కావాలి?" అని నమ్మించిన ఈ పెద్దమనిషిదా? నాదా; చెప్పు అరుణా-చెప్పు?''

నా శరీరంలో రక్తం ఉవ్వెత్తుగా లేచి పడసాగింది.

''ఏమిటి? ఏ మంటున్నావు సుశీలా'' అరుణ ఆందోళనగా అంటున్నది. నిరంజన్ మీరా కీర్తన అందుకున్నాడు. అందరూ భక్తిరసంలో మునిగిపోయారు. సర్వజడ ప్రకృతినీ చైతన్యవంతము చేయగలిగిన మీరా భక్తి భాగీరథిలో మార్జనము చేసిన కృష్ణదేవుడే ధన్యుడైనాడు? మీరా భక్తిగీతం వింటూ భక్తిరసంలో ఓలలాడుతున్న ప్రేక్షకుడు ఈ సారి గట్టిగా మందలించాడు. తిరిగి నెమ్మదిగా మాట్లాడసాగింది సుశీల.

★